క్లుప్తంగా

కనీస అవసరాలను తీర్చడమే అభివృద్ధి



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బ్రహ్మానందరెడ్డి

చినగంజాం: ప్రజల కనీస అవసరాలను తీర్చడమే అభివృద్ధి అని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన ప్రారంభోత్సవం నిర్వహించారు. సుమారు రూ.6 లక్షల నిధులతో మంజూరైన సీసీ రోడ్డును పనులు ప్రారంభించడంతో ఆయన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సక్రమమైన సేవలందిస్తూ వారి అవసరాలను తీర్చాల్సిన అవసరం అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి బాబురావు, బీ వెంకటేశ్వరరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సృజన సాహిత్య సమావేశం

అద్దంకి: స్థానిక కమలేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 31న, సాయంత్రం 6:30 గంటలకు మహాకవి దాశరథి, వజ్రాయుధ కవి ఆవంత్స సోమసుందర్‌ల శతజయంతి వేడుకల సందర్భంగా దాశరథి కవిత్వం గురించి అనిల్ కుమార్ సూరి, సోమసుందర్ జీవితం-రచనల గురించి పాలపర్తి జ్యోతిష్మతి ప్రసంగించనున్నట్లు సాహితీవేత్తలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఈసందర్భంగా సాహిత్య అభిమానులు, రచయితలు పాల్గొనాలని వారు కోరారు.

అక్రమాలకు తావు లేకుండా రేషన్ పంపిణీ



డీలర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న తహశీల్దార్ సింగారావు

జే.పంగులూరు: అక్రమాలకు తావులేకుండా లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేయాలని తహశీల్దార్ సింగారావు అన్నారు. మండల పరిధిలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం రేషన్ డీలర్ల సమావేశం జరిగింది. ఈసమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి నెల డీలర్లు 15వ తేదీ లోపే డీడీలు కట్టాలన్నారు. ప్రతి నెల రేషన్ బియ్యం పంపిణీ 1వ తేదీ ఉదయం 6.30 గంటలకు మొదలు పెట్టి, ప్రతి లబ్ధిదారుడికి రేషన్ బియ్యం అందేలా సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ ఆదినారాయణ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో ఉపయోగాలు



సైన్స్ ఎగ్జిబిషన్ తిలకిస్తున్న డిప్యూటీ డీఈఓ

చినగంజాం: విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలో ఎక్కువగా పాల్గొనేందుకు ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని పర్చూరు డిప్యూటీ డీఈఓ ఏ శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పాఠశాల స్థాయిలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో భాగంగా ప్రథమ బహుమతి రాగా ఉపాధ్యాయుడు సీహెచ్ సుబ్బారావుకు దక్కింది. ఉపాధ్యాయుడు, విద్యార్థి సంయుక్త ప్రదర్శనలో సోలార్ డ్రైయర్‌కు ప్రథమ బహుమతి రాగా ఉపాధ్యాయుడు ఎస్ శ్రీనివాసరావు, విద్యార్థి జీ అమృత హర్షిణి దక్కింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలో విండ్ ఎనర్జీకి ప్రథమ బహుమతి రాగా ఉపాధ్యాయుడు ఏ ప్రసాదరావు, విద్యార్థులు వీ వెంకట సాయి, వీ శివచందర్‌కు ప్రథమ బహుమతి సాధించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్ కోటేశ్వరరావు, పాఠశాల హెచ్ఎం డీ రత్నకుమారి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్జీల విచారణలో అలసత్వం వద్దు

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్దిష్ట సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహశీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాసు పుస్తకాలు, రెవెన్యూ అజమాయిషీ, నాలా కన్వర్షన్, అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. రెవెన్యూ ఉద్యోగులు తమకు కేటాయించిన విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలను త్వరగా అందించడంతో పాటుగా గ్రామాల్లో ఎక్కడా కూడా అనధికార లే అవుట్లు వేయకుండా కట్టడి చేయాలన్నారు. సమావేశంలో డిటీ అర్జున్, వీఆర్వోలు ఉన్నారు.



బూదవాడలో వైరస్ సోకిన మిర్చి పొలం



మిర్చి పంటను పీకివేసిన పొలం (ఫైల్)



వైరస్ సోకిన మొక్క

రైతుకు కూటమి తెగులు!

- ఖరీఫ్‌లో మినుము, రబీలో మిర్చి రైతుల కుదేలు
- మొక్కజొన్న, మిర్చిలో వైరస్ తెగుళ్లతో రైతులు బెంబేలు
- 70 శాతం తుడిచిపెట్టుకుపోయిన మిర్చి
- నిద్రపోతున్న కూటమి ప్రభుత్వం, అధికార యంత్రాంగం

జే.పంగులూరు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు వైభవాన్ని చూస్తే.. నేడు కూటమి ప్రభుత్వంలో రైతు అష్టకష్టాలు పడుతున్నాడు. దానికి తోడు ప్రకృతి ప్రకోపానికి బలై మరింత విలవిల్లాడుతున్నాడు. వరుస తుఫాన్లు దాడి చేసి నోటి కూడి కూడిని గద్దలా తన్నుకుపోయింది. దీంతో లక్షలు పెట్టుబడి పెట్టి అప్పుల పాలై రైతన్న దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. ఈ ఏడాది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక వైపు ఖరీఫ్‌లో వేసిన మినిము పంట తీవ్ర వర్షాభావంతో చేతికి అందలేదు. దానికి తోడు ప్రభుత్వం నుంచి కూడా మినుము రైతులకు ఎలాంటి నష్టపరిహారం అందలేదు. మినుము తరువాత రబీలో వేసిన మొక్కజొన్నకు కూడా కత్తెరపురుగు వ్యాపించి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూలిగే నక్కమీద తాటికాయ పడినట్లు మిర్చి పంటకు సోకాయి. గతేడాది మిర్చి పంటకు మంచి దిగుబడి వచ్చినా గిట్టుబాటు ధర లేదు. ఈ సంవత్సరం ఆది నుంచి మిర్చి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక వైపు మిర్చి పంటకు గిట్టుబాటు ధరలేక పోవటం, మరో వైపు పెరిగిన పెట్టుబడులు, తెగుళ్లతో రైతులు నష్టాలపాలయ్యాడు. ఎన్నిసార్లు క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తున్నా మిర్చిలో వైరస్ తగ్గడం లేదు. చేసేది లేక కొంత మంది రైతులు మిర్చి పంటను పీకేస్తున్నారు.



మిర్చి పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు (ఫైల్)

వర్షాభావం, తుఫాన్‌లతో రైతుల కష్టాలు..

తీవ్ర వర్షాభావంతో శనగ రైతులు, మినుము, పత్తి, మొక్కజొన్న రైతులు పూర్తిగా నష్టాలు చవిచూసే పరిస్థితి ఏర్పడిండి. గత ఏడాది మండలంలో 3000 వేల ఎకరాల వరకు మిర్చి పంటను సాగు చేశారు. సరైన గిట్టుబాటు ధర లేక ఈఏడాది 1500 ఎకరాల్లోపే మిర్చి పంట సాగు చేశారు. ప్రతి రైతు ఒక ఎకరా మిర్చి పంటకు రూ. 50 వేలకు పైనే ఖర్చు పెట్టారు. ఒక వైపు గిట్టుబాటు ధరలేదు, మరో వైపు మిర్చికి తెగుళ్లు వ్యాపించాయి. గత వారం పడిన వర్షానికి వైరస్ తెగులు ఒక్క సారిగా వ్యాపించి మండలంలో 70 శాతం పైగా ఎకరాలకు ఎకరాలే తుడిచిపెట్టుకుపోయాయి.

తెగుళ్లతో పెరిగిన పెట్టుబడి.. అప్పులు

వైరస్ తెగులు వ్యాపించిన మిర్చి పంటను కాపాడటానికి రైతులు పురుగు మందుల కంపెనీ వారు చెప్పిన ప్రతి మందును ఇష్టానుసారంగా వాడారు. దీంతో రైతులకు పంట పెట్టుబడులు ఎక్కువయ్యాయి. అయినా తెగుళ్లు మాత్రం తగ్గుముఖం పట్టలేదు. దీంతో రైతులు చేసేది లేక ఇక మిర్చి పంట చేతికి అందుతుందన్న నమ్మకం లేక మిర్చి పంటను పీకేస్తున్నారు.

రైతులను గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం..

ఖరీఫ్‌లో వేసి మినుము పంట పూర్తి నష్టం జరిగితే, రైతులకు నష్టపరిహారం అందిన జాడలేదు. వర్షానికి మినుము పంట పోయిన సమయంలో అధికారులు హడావుడి చేసి 1700 ఎకరాల్లో నష్టం జరిగిందని రైతుల జాబితా ప్రభుత్వానికి పంపించారు. ఇంత వరకు దాని జాడలేదు. అన్నదాత సుఖీభవ అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిర్చిలో వైరస్ వచ్చి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు వచ్చిన దాఖలాలు లేవని రైతులు వాపోతున్నారు.

ఎకరాకు లక్ష రూపాయలు నష్టపోయా..



ఈఏడాది 2.50 ఎకరాలు మిర్చి పంట వేశాను. పంట వేసిన నాటినుంచి ఇప్పటికి ఎకరాకు రూ.1 లక్ష ఖర్చు పెట్టాను. మూడు నెలలో పంటకు ఒక్కసారిగా వైరస్ తెగులు వ్యాపించింది. ఎన్ని మందులు కొట్టినా వైరస్ తగ్గలేదు. కొట్టులో తెచ్చిన ఎరువులు, పురుగు మందులకు అప్పులు పెరిగిపోయాయి. ప్రభుత్వం గమనించి మిర్చి రైతులను ఆదుకోవాలి.

– వరికల్లు శేషయ్య, బూదవాడ

ఈ ఏడాది ఏ పంట చేతికందే పరిస్థితి లేదు ..



ఖరీఫ్‌లో వర్షాభావంతో మినుము పంట చేతికి అందలేదు. దానికి సంబంధించిన నష్ట పరిహారం కూడా అందలేదు. రబీలో వేసిన మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు వ్యాపించింది. మొదట్లో బాగున్న మిర్చి పంటకు ఒక్క సారిగా తెగుళ్లు వ్యాపించాయి. ప్రభుత్వం నుంచి చిల్లిగవ్వ కూడా సహాయం అందలేదు.

– సీతారామిరెడ్డి రైతు, బూదవాడ

హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి



చీరాలలో ధర్నా నిర్వహిస్తున్న వామపక్షాలు



మార్టూరులో నిరసన చేస్తున్న వామపక్ష నాయకులు

మార్టూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేసి క్షమాపణ చెప్పాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీల దేశవ్యాప్త నిరసన ప్రదర్శనలో భాగంగా సోమవారం సాయంత్రం మార్టూరులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు బత్తుల హనుమంతరావు మాట్లాడుతూ కేంద్రంలోని మతోన్మాద బీజేపీ రాజ్యాంగాన్ని తద్వారా పౌరులకు సంక్రమించిన హక్కులను రూపుమాపి నాశనం చేయడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. ఈసందర్భంగా నాయకులు స్థానిక గన్నవరం సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి నిరసనలు తెలుపుతూ స్టేట్ బ్యాంక్ సెంటర్ మీదుగాకొణిదెన సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, వై రాంబాబు బి సూరిబాబు, మొఘల్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి తీరును నిరసిస్తూ చీరాలలో సోమవారం వామపక్షాలు, దళిత బహుజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాకు సీపీఎం చీరాల ఏరియా కార్యదర్శి ఎన్.బాబూరావు అధ్యక్షత వహించగా పలువురు నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎన్.బాబూరావు, పి.కొండయ్య, గోసాల ఆశీర్వాదం, సామేలు, చేనేత సమాఖ్య రాష్ట్ర నాయకులు మాచర్ల మోహనరావు, బోయిన మోషే తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం ఉంటే ఉన్నత భవిష్యత్

మార్టూరు: విద్యతో పాటు ఇతర రంగాల్లోనూ నైపుణ్యాన్ని పెంపొందించుకోగలిగితే జీవితంలో ఉన్నతంగా రాణించవచ్చని ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ రాజా అనిరుధ్ అన్నారు. మండలంలోని ద్రోణాదుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సాయంత్రం నిర్వహించిన వ్యక్తిత్వ వికాస శిక్షణలో ఆయన విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలలో ఉత్తీర్ణులు కాలేకపోవడంతో జీవితం అయిపోయిందని అనుకోకూడదన్నారు. తమకిష్టమైన రంగాల్లో రాణించి ఉన్నతమైన స్థానాల్లో నిలిచిన వారెందరో ఉన్నారని ఆయన సోదాహరణంగా విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల బృందం డాక్టర్ రాజా అనిరుధ్‌ను ఘనంగా సత్కరించి సన్మానించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజా అనిరుధ్

శ్మశాన వాటిక అభివృద్ధికి రోటరీ విరాళం

పర్చూరు (చినగంజాం): శ్మశాన వాటిక అభివృద్ధికి రోటరీ క్లబ్ విరాళం అందజేసింది. సోమవారం స్థానిక రోటరీ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ మహాప్రస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులకు రూ.1 లక్ష చెక్ అందజేశారు. శ్మశాన వాటికలో క్షవరశాల నిర్మాణానికి రూ.2 లక్షలు అవసరమవుతాయని క్లబ్ సభ్యులను అభివృద్ధి కమిటీ సభ్యులు అభ్యర్థించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు తేళ్ల రమేష్ చంద్ర, గడ్డిపాటి శ్రీనివాసరావు, కోమటి ఆంజనేయులు, నాగబైరు శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, కొల్లా నరేంద్ర, కోట శ్రీనివాసరావు, కోట హరిబాబు, పోలిశెట్టి చంద్రశేఖర్, మహా ప్రస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు కఠారి సురేంద్ర, ఒగ్గిశెట్టి గోవిందరాజులు, నరసింహారావు, కృష్ణంశెట్టి శ్రీనివాసరావు, రంగిశెట్టి ఆంజనేయులు, మంగళగిరి కోటేశ్వరరావు, తులసి శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చెక్ అందిస్తున్న రోటరీ సభ్యులు

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



అశోక్‌బాబును కలిసి సత్కరిస్తున్న వాసుబాబు

చీరాల: కూటమి ప్రభుత్వం దళితులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన పథకాలను నిలిపివేసిందని.. తిరిగి పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వాసిమళ్ల వాసు అన్నారు. పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమించిన సందర్భంగా ఆయన సోమవారం జిల్లా పరిధిలోని రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి ఈపూరి గణేష్, వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబులను మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని తిరిగి ఏర్పాటు చేసేందుకు, జిల్లాలో దళితుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు గోసాల అశోక్, మొగిలి శబరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలతో మేలు



వరి ధాన్యాన్ని తూకం వేస్తున్న అధికారులు

వేటపాలెం: పంట కోత ప్రయోగాలతో రైతులకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి ఐ కాశీవిశ్వనాథ్ అన్నారు. మండల పరిధిలోని పందిళ్లపల్లిలో ఖరీఫ్-2024 సంబంధించిన ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద వరి పొలంలో పంట కోత ప్రయోగం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కోత ప్రయోగాల వలన రైతు సరాసరి దిగుబడి గ్రామ సరాసరి దిగుబడి, రాష్ట్ర సరాసరి దిగుబడి అంచనా వేయటకు ఉపయోగపడుతుందని తెలిపారు. ధాన్యంలో తేమశాతం, ధాన్యం తూర్పార పట్టుడం, ధాన్యం ఎండబెట్టడం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



పోలీస్ స్టేషన్ వద్ద ఉంచిన ఇసుక ట్రాక్టర్లు

వేటపాలెం: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి జాతీయ రహదారిపై ప్రత్యేక పికెట్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈక్రమంలో అనుమతులు లేకుండా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను ఆపివేశారు. వారి వద్ద ఎలాంటి ప్రతాలు లేకపోవడంతో ట్రాక్టర్లను పోలీసు స్టేషన్‌కి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

చెక్ పోస్టు ఏర్పాటు..

వేటపాలెం బైపాస్ రోడ్డు కూడలిలో ఇసుక అక్రమ తరలింపులను అడ్డుకోవడానికి చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు ఎస్సై తెలిపారు. రెవెన్యూ, పోలీసుల జాయింట్ ఆపరేషన్ ద్వారా ఈ చెక్ పోస్టును ఏర్పాటు చేశామని తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కిశోర వికాసంతో భవిష్యత్



మాట్లాడుతున్న సీడీపీఓ సుభద్ర

యద్దనపూడి: కిశోర వికాస కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్‌కు పునాది వేస్తుందని.. ఉజ్వల, ఆరోగ్యకరమైన, సాధికారిత దిశగా ఆమె వేసే ప్రతి అడుగు సమష్టి కృషితో చేయూతనిద్దామని పర్చూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ సుభద్ర అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల బాలికలు చదువుపై దృష్టి పెట్టేలా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీహర్ష, జూనియర్ కాలేజ్ లెక్చరర్ విజయలక్ష్మి, ఏపీఎం వెంకట్రావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూజాత, మండలంలోని ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

కొత్త ఏడాది వేడుకలకు అనుమతులు తప్పనిసరి

మేదరమెట్ల/చీరాల: నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకునేందుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని చీరాల డీఎస్పీ మొయిన్, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమ నిర్వాహకులు లౌడ్ స్పీకర్లు, మ్యూజిక్ కోసం తప్పనిసరిగా సంబంధిత పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. రాత్రి 10 గంటల తరువాత లౌడ్ స్పీకర్లను వాడకూడదని, మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక నిఘా నిర్వహిస్తామని చెప్పారు. మద్యం తాగి నడిపితే రూ.10 వేల జరిమానా, లైసెన్స్ రద్దు, లేదా ఆరు నెలల జైలు శిక్ష విధిస్తారని వారు హెచ్చరించారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

చీరాల: రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం క్రయవిక్రయాలు చేస్తే శాఖపరమైన చర్యలు తప్పవని చీరాల ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు హెచ్చరించారు. జిల్లా ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత రెండు నెలల వ్యవధిలో చీరాల ఎక్సైజ్ శాఖ పరిధిలోని నాలుగు మండలాల్లో నమోదైన కేసుల వివరాలు వెల్లడించారు. నాటుసారా, గొలుసు దుకాణాలు, అక్రమ మద్యం తరలింపులో 57 కేసులు నమోదు అయ్యాయని, అలానే పాత కేసులలో 36 మంది నిందితులను తహశీల్దార్ వద్ద రూ.1 లక్ష పూచికత్తుపై బైండోవర్ చేసినట్లు తెలిపారు. నిరంతరం ఎక్సైజ్ శాఖ దాడులు కొనసాగుతాయన్నారు.

అభ్యసనం కోసమే మోడల్ పేపర్లు

అద్దంకి: అభ్యసనా శక్తిని పెంచడం కోసమే మోడల్ పేపర్లను పంపిణీ చేసినట్లు రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో మండలంలోని మైలవరం స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న 45 మంది విద్యార్థులకు పరీక్ష మోడల్ పేపర్ బుక్స్, ఎం శ్రీనివాసరావు ఆర్థిక సౌజన్యంతో అందజేశారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, యోగా గురువు శేషారెడ్డి, హెచ్ఎం నాగేశ్వరావు, సీఎంసీ చైర్మన్ భీమని కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లైసెన్స్‌లు లేని ఆటోలపై కేసులు

వేటపాలెం: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఆటోలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎం వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సోమవారం స్థానిక మార్కెట్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ నూతన సంవత్సరం సందర్భంగా మద్యం తాగి ఆటోలు నడిపినా, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నూతన సంవత్సరం సంతోషాలు నింపాలి



స్వర్ణలో నూతన సంవత్సర వేడుకలు చేసుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కారంచేడు: రాబోవు నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లోను సంతోషాలను, ఆనందాలను నింపాలని ఐసీడీఎస్ స్వర్ణ సెక్టార్ సూపర్‌వైజర్ సునీత అన్నారు. సోమవారం ఆమె మండలంలోని స్వర్ణ గ్రామంలో సెక్టార్ పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సెంటర్లకు చెందిన అన్ని రకాల రికార్డులను, రిపోర్టులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో స్వర్ణ, కేవీపాలెం, జరుబులవారిపాలెం, కేశవరప్పాడు, స్వర్ణపాలెం, రంగప్పనాయుడువారిపాలెం గ్రామాలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.